సుం: మా మంచి సాకే దొరికింది.

ఆది: ఏసాకో. రేపాయనకు సినిమా కంపెనీలో ఉద్యోగం అవుతోంది. ఇకనన్నా వారి కుటుంబంజోలికి పోక బుద్ధిగా ఉండు.

సుం: (కోపంగా) ఆ సాంబయ్యగారి చెప్పుడు మాటలు విని నన్ను అడ్డమైన మాటలూ అంటే నేను పడను సుమండీ.

ఆది: పడు, పడకపో, నువ్వాయన్ని ఇంకో రొంపిలోకి దింపినా నే చెయ్యగల దేమీ లేదు.

సుం: ఆయన రొంపిలోకి దిగితే నాకేం, ఏట్లోకి దిగితే నాకేం.

# 6

కా: అవును సుందరమ్మగారూ, ఇది మంచిఉద్యోగం. ఇక మా కష్టాలు గట్టెక్కి నట్టే. కొన్ని నగలేమో కొనేశాను. ఇక నాలుగు డబ్బులు మిగిలితే వెనకేసుకునే పద్ధతి చూడాలి.

సుం: మంచిఉద్యోగం, బాగానే ఉందిగాని సినిమా కంపెనీ కాకుండా ఉంటే బాగుండి పోను. పాపం, అందులోనూ మీ ఆయన చాలా అమాయకం మనిషి.

కా: సినిమా కంపెనీల్లో జీతాలు సరిగా రావా? మోసం చేస్తారా?

సుం: జీతాలు రాకేం? ఇంటికిరావు.

కా: అదేం?

సుం: ఎంత సత్తెకాలం మనుషులండీ మీరు? సినిమా కంపెనీల్లో వేషాలేసే ఆడ వాళ్లుంటారు చూడండీ. వాళ్లు, అమ్మో.

కా: మావారు అటువంటివారు కారులెండి.

సుం: ఏమిటండీ చెబుతారూ. ఆడది తలుచుకున్నాక మగవాడి ప్రజ్ఞేమిటి? ముష్టి ప్రజ్ఞ: విశ్వామిత్రుడంతటివాడు పిల్లి మొగ్గలు వేస్తేనూ!

కా: ఈ సినిమా ఆడవాళ్లేంచేస్తారండీ?

సుం: ఏంచేస్తారేమిటి? తిరుక్షౌరం చేసే స్తారు. జీతం ఇంటికిరాదని చెప్పాగాదూ?

కా: నిజమా? మీకెట్లా తెలుసూ?

సుం: రెండు మూడేళ్ల క్రితం మావారికి సినిమా కంపెనీవాళ్లు ఏడువందల యాభై రూపాయల మీద ఉద్యోగం ఇస్తానంటే నేను ఒప్పుకోలా, బతికుంటే బలుసాకు తినొచ్చు. అంతేగాని మగవాళ్లని చూస్తూ చూస్తూ ఆ నరకంలో అడుగు పెట్టనివ్వటమే. ఒకసారి కాలు జారినాక ఇంకేమన్నా ఉందా!

కా: (భయపడి) అమ్మయ్యో. అలాగైతే ఈ ఉద్యోగం వద్దుబాబూ. డబ్బు లేకపోతే పీడాపోయింది. ఇంకా నయం, ముందుగా చెప్పారు.

సుం; చేతులు కాలాక ఆకులు పట్టుకుని మాత్రం లాభమేమిటి గనకా? చెబుదామావద్దా అని రాత్రల్లా మధనపడ్డా. చెబితే ఏమను కుంటారో, చెప్పకపోతే నిష్కారణంగా పండంటి కాపరం పాడవుతే చూస్తూ ఊరు కున్న పాతకం చుట్టుకుంటుందే! అని చాలా బాధపడ్డా....అన్నట్టు మీవా రొచ్చినట్టుంది. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోండి.

కా: మంచిదండీ....

సాం: ఏమే, ఆ వెళ్లింది ఆదినారాయణ గారి భార్యేనా?

